www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

ఆదివారం, 19.05.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 218




## పచ్చని ఇంటికి పునాదులు వేసుకుందాం

- హైటెక్స్ వేదికగా ఉత్సాహంగా సాగుతున్న ఐజీబీసీ ప్రాపర్టీ షో
- కొలువుదీరిన పర్యావరణహితమైన భవనాలు, ప్రాజెక్టులు
- ఆకట్టుకున్న డ్రీమ్ యువర్ ఫ్యూచర్ గ్రీన్ హోం పెయింటింగ్ పోటీలు
- పర్యావరణ సంరక్షణపై నిపుణులతో చర్చాగోష్ఠి

వివరాలు రియల్ టాక్ 3లో

# కేబినెట్ మీటింగ్ వాయిదా

- అనుమతి ఇవ్వని ఎన్నికల సంఘం ▪ ఢిల్లీకి వెళ్లాలని రేవంత్ నిర్ణయం
- రైతు రుణమాఫీ, విభజన సమస్యలపై చర్చించాలని భావించిన సర్కారు
- సాయంత్రం దాటినా ఈసీ నుంచి నో ఇన్ఫర్మేషన్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాకపోవడంతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతాంగానికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించాలని మంత్రులు భావించారు. కేబినెట్ భేటీ నిర్వహించడానికి ప్రభుత్వం ముందుగానే ఈసీని అనుమతి కోరింది. కానీ శనివారం (మే 18న) మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు ఈసీ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో తెలంగాణ కేబినెట్ భేటీ వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం సచివాలయంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చలు జరిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికలో ఏమేం సిఫారసులున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చేపట్టాల్సిన చర్యలపై రేవంత్ రెడ్డి ఆరా తీశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి సీఎం రేవంత్ వెంట ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోయాయి. దాంతో తాత్కాలికంగా చేపట్టాల్సిన మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై ఎన్డీఎస్ఏ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల మధ్యంతర నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో ఉన్న ముఖ్యమైన అంశాలు, సిఫారసులను మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఇతర మిగతా 2లో




# దమ్ముంటే అరెస్ట్ చేయండి

- రేపు మీ ఆఫీసుకే వస్తా
- వీలైతే మా పార్టీ లీడర్లందరినీ అరెస్ట్ చేయండి
- అరవింద్ కేజ్రీవాల్ సవాల్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ఆమ్ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మాలీవాల్ పై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడికి పాల్పడిన ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో బిభవ్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందించారు. పార్టీ నేతలతో భాజపా ప్రధాన కార్యాలయానికి చేరుకుంటానని.. వీలైతే అందరినీ అరెస్టు చేసుకోవాలంటూ సవాల్ చేశారు. "ప్రధాని మోదీ జీ.. మీరు ఆప్ నేతలైన మనీశ్ సిసోదియా, సంజయ్‌సింగ్, నాతో సహా ఒక్కొక్కరినీ కారాగారానికి పంపిస్తూ గేమ్ ఆడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు నేను నా పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలందరితో కలిసి భాజపా ప్రధాన కార్యాలయానికి వస్తా. ఎవరెవరిని జైల్లో పెట్టాలనుకుంటున్నారో ఒకేసారి పెట్టేయండి. నేతల్ని జైల్లో పెట్టడం ద్వారా పార్టీని అణిచివేయాలను మీరు అనుకుంటున్నారు. ఇలాంటి చర్యలతో పార్టీ మిగతా 2లో

# ధాన్యం కొనుగోలులో జాప్యమెందుకు?

- సెంటర్లు ప్రారంభించి 45 రోజులవుతోంది
- అయినా కొనుగోళ్లు జరగట్లేదు
- వర్షాలతో ధాన్యం తడిచింది ▪ రైతులు ఇబ్బంది పడుతున్నారు
- తడిచిన ధాన్యాన్ని కూడా కొనగోలు చేయాలి
- వరి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇవ్వండి
- బీజేపీ ఎమ్మెల్యేల డిమాండ్ ▪ సీఎంకు వినతిపత్రం అందజేత



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**
ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం జాప్యమెందుకు చేస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ఈమేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, పైడి రాకేష్ రెడ్డి కలిశారు. రైతు సమస్యలు, పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు పరిష్కరించాలని, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని వారు వినతిలో పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 45 రోజులవుతున్నా ఇంకా కొనుగోలులో జాప్యమవుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత వల్ల కొన్ని చోట్ల రైతులు ధాన్యం తెచ్చి నెలరోజులవుతున్నా తూకం వేయకపోవడం దారుణమన్నారు. అకాల వర్షాల వల్ల కొన్ని చోట్ల కల్లాల్లోనే ధాన్యం తడిసిపోగా, కొనుగోలు కేంద్రాల్లోనూ వర్షాలకు ధాన్యం తడిసిపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయకపోవడమే దీనిక కారణమని సీఎంకు మిగతా 2లో




# శ్రీనిధి, గురునానక్ కాలేజీలపై చర్యలుంటాయ్

- ముందుగానే సీట్లు భర్తీ చేసుకున్నట్లు తేలితే చర్యలు
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**
షెడ్యూల్ కు ముందే సీట్లు భర్తీ చేసుకున్నట్టు ఫిర్యాదులు వస్తే ఆ కాలేజీలపై చర్యలు తప్పవని, శ్రీనిధి, గురునానక్ కాలేజీలపై చర్యలుంటాయని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం హెచ్చరించారు. జేఎన్టీయూలో ఈఏపీసెట్ ఫలితాలు విడుదలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగంలో బీ కేటగిరీ సీట్లను కూడా ఆన్ లైన్ లోనే భర్తీచేసే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన మిగతా 2లో

# బీజేపీకి పది ఎంపీ సీట్లు పక్కా

- ఆదిలాబాద్ లో లక్ష మెజారిటీ
- మెదక్ మినహా మిగతాచోట్ల మూడోస్థానంలో బీఆర్ఎస్
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**
ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పది ఎంపీ సీట్లు రావడం పక్కా అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన అనంతరం శనివారం ఆయన చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేశారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ లో లక్ష మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. వరంగల్, భువనగిరి, జహీరాబాద్ లో చాలా క్లోజ్ కంటెస్ట్ ఉందని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ కాంగ్రెస్ గెలిచే లిస్టులో ఉన్నా.. తక్కువ మెజారిటీతో అయినా తామే గెలుస్తున్నట్లు జోస్యం చెప్పారు. మెదక్‌లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ ఉందని ఏలేటి వివరించారు. మెదక్ మినహా మిగతా చోట్ల బీఆర్ఎస్ కు మూడో స్థానమేనని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

**మెట్రోరైలు ప్రయాణ సమయాల్లో మార్పు లేదు** వివరాలు 2లో

**జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ** వివరాలు 2లో

# ఇప్పుడు తెలంగాణకు కావాల్సింది ధిక్కార స్వరాలు

- ఉన్నత విద్యావంతుడు రాకేశ్ రెడ్డిని గెలిపించండి
- ప్రజాసమస్యలపై ప్రశ్నించే తత్వం ఉంది
- కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే భజన తప్ప ఏమీ ఉండదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి హన్మకొండ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానిలో విద్యాభ్యాసం చేశారు. మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్‌లో డ్యూయల్ మాస్టర్స్ డిగ్రీ పొందారు. అమెరికాలో ఏడేళ్ల పాటు పలు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగం చేసిన రాకేష్‌రెడ్డి.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి మిగతా 2లో




# ఆంధ్రాపిల్లలే టాపర్లు

- ఈఏపీ సెట్ ఫలితాలు విడుదల
- టాప్ 10 లిస్ట్ లో అమ్మాయిలకు నో ప్లేస్

వివరాలు 2లో

# రామాలయం గేట్లు తెరిపించిందే మేము

- రాజకీయాల కోసం దేవుడి పేరు వాడుకుంటారా?
- బుల్డోజర్ తో రామాలయాన్ని కూల్చేస్తామనడం దారుణం
- ప్రధాని వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ప్రధాని నరేంద్ర మోడీ మతవిశ్వాసాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారంటూ మోడీ వ్యాఖ్యలు చేయడం దారుణమని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ మిగతా 2లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్



# ఇప్పుడు తెలంగాణకు కావాల్సింది ధిక్కార స్వరాలు

**మొదటిపేజీ తరువాయి**

అడుగుపెట్టారని కేటీఆర్ తెలిపారు.

### ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి

అద్భుతమైన వాగ్ధాటి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి.. సమకాలీన రాజకీయాంశాలపై, ఆర్థిక స్థితిగతులపై ప్రముఖ వార్తా పత్రికల్లో ఆర్టికల్స్ రాయడమే కాకుండా నవ శకానికి నాంది, ప్రగతి రథ చక్రాలు, ఫిస్కల్ ఫెడరలిజం, ద డాన్ ఆఫ్ న్యూ ఎరా, తెలంగాణ ఎకానమీ లాంటి పుస్తకాలను రచించారు. సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇండియన్ ఎకానమీ, తెలంగాణ ఎకానమీపై గెస్ట్ లెక్చర్లు కూడా ఇచ్చారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థుల కోసం రాకేష్ రెడ్డి ఈక్లాసెస్ యాప్ అనే ఫ్రీ కోచింగ్ యాప్‌ను రూపొందించి ఉచితంగా అందజేశారు. హన్మకొండలో మెగా జాబ్ మేళాలు నిర్వహించారు. టీవీ చర్చల్లో చురుగ్గా పాల్గొని, విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యల, హక్కులపై బలంగా గళం విప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

### నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు..

కరోనా మహమ్మారి సమయంలో, వరంగల్‌లో వరదలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలిచి తన వంతు సహాయాన్ని అందించారు. ఇండస్ ఫౌండేషన్ ద్వారా ఓరుగల్లులో కూచిపూడి, పేరిణి లాంటి నృత్య కళలను, పల్లె సంస్కృతులను, సాహిత్యాన్ని, మన జానపద కళారూపాలను పరిరక్షించడం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న రాకేష్ రెడ్డి.. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సరైన చాయిస్. యువకుడు, ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే తత్వం, లోతైన విషయ పరిజ్ఞానం ఉన్న రాకేష్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే.. పట్టభద్రుల గొంతుకగా నిలుస్తారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మీ మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్ రెడ్డికే వేసి.. వారిని గెలిపించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు

# రామాలయం గేట్లు తెరిపించిందే మేము

**మొదటిపేజీ తరువాయి**

భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అయోధ్య రామాలయంపై చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ప్రధాని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. బుల్డోజర్‌తో అయోధ్య రామాలయాన్ని కూల్చేస్తామంటూ ప్రధాని వ్యాఖ్యలు చేయడం దారుణమన్న జీవన్ రెడ్డి.. ఈ తరహా వ్యాఖ్యలు మత విశ్వాసాలను రెచ్చగొట్టడమేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వెంటనే ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బుల్డోజర్‌ను తెరపైకి తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీయే అన్న జీవన్ రెడ్డి.. ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రధాని ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ విమర్శించారు. అయోధ్యలో రామాలయం గేట్లు తెరిపించిందే కాంగ్రెస్ పార్టీ అని, రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని జీవన్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ బతికి ఉంటే రామాలయ నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని స్పష్టం చేశారు.

### ఎన్నికల కోసం దేవుడిని వాడొద్దు

ఎన్నికల వచ్చిన ప్రతిసారి దేవుడిని వాడుకోవడం బీజేపీకి పరిపాటిగా మారిందని, ఇది మంచి పద్ధతి కాదని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మత సామరస్యానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్న జీవన్ రెడ్డి.. ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ ఈ తరహా వ్యాఖ్యలు చేయలేదన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దూరదర్శన్‌లో రామాయణ, మహాభారతాలు ప్రసారం చేశారని, ఈ విషయాన్ని బీజేపీ నేతలు గుర్తించుకోవాలని సూచించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ వచ్చిన తరువాతే రామాలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగినట్టు ప్రచారం చేసుకోవడం తగదన్న జీవన్ రెడ్డి.. కోర్టు తీర్పు ప్రకారమే ఆలయ నిర్మాణం జరిగిన విషయాన్ని గుర్తించాలన్నారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని, ఇంకా ఎన్నాళ్లు ఈ తరహా రాజకీయాలు చేస్తారంటూ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలు కోసం బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా చేసిన అభివృద్ధి, ఇతర అంశాలతో రాజకీయాలు చేయాలని, మత ప్రాతిపదిక రాజకీయాలకు బీజేపీ స్వస్తి పలకాలని జీవన్‌రెడ్డి సూచించారు.

# మెట్రోరైలు ప్రయాణ సమయాల్లో మార్పు లేదు

**విశాలభారతి,హైదరాబాద్:**



హైదరాబాద్ మెట్రోరైలు ప్రయాణ వేళల్లో మార్పుల విషయమై జరుగుతున్న ప్రచారాన్ని మెట్రోరైలు లిమిటెడ్ అధికారులు ఖండించారు. మెట్రో ప్రయాణ సమయాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మెట్రో రైళ్లు ఎప్పటిలానే 6 నుంచి రాత్రి 11 గంటల మధ్య నడుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేశారంటూ జరుగుతున్న ప్రచారాన్ని హైదరాబాద్ ఎల్అండ్టీ మెట్రో రైలు లిమిటెడ్ అధికారులు ఖండించారు. మెట్రో ప్రయాణ సమయాల్లో ఎలాంటి మార్పు చేర్పులు చేయలేదని, యథావిధిగానే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటల నుంచే రైళ్ల రాకపోకలు మొదలవుతాయనేది ట్రయల్లో మాత్రమే చేశామని, ఇంకా ఆ వేళల్లో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఎల్అండ్ టీ వెల్లడించింది. ప్రయాణికుల రద్దీ, రైళ్లు, ట్రాక్ నిర్వహణ సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణీకులెవరూ మెట్రో రైళ్ల సమయాల్లో అయోమయానికి గురికావద్దని, యథావిధిగా నిర్దిష్ట సమయానికే రాకపోకలు ఉంటాయని సూచించింది ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు వెళ్లే ప్రయాణీకులకు సౌలభ్యంగా ఉండే విధంగా మెట్రో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా మెట్రో సేవలు ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుండగా మే 14 వ తేదీన మాత్రం మెట్రోను ఉదయం 5 గంటల 30 నిమిషాలకే నడిపే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణీకుల సౌకర్యార్థమే ఈ విధంగా నిర్ణయం తీసుకున్నట్లుగా అధికారులు వెల్లడించారు

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ ఎండి.షాకీర్ అలీ

**జహీరాబాద్, విశాల భారతి:**



తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో కోహీర్ వైస్ ఎంపీపీ ఎండి.షాకీర్ అలీ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికీ తప్పకుండ ఫలితం ఉంటుందని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో సైనుకుల్లా పని చేసి లీడ్ తీసుకోచ్చిన వారికే స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్,ఎంపీటిసి, టికెట్లు ఇచ్చి తప్పకుండ గెలుపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు. ఎవరు అధర్యాపడవద్దని ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎవరు బాధపడకుండా ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో యువతకు తగిన ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు.

# శ్రీనిధి, గురునానక్ కాలేజీలపై చర్యలుంటాయ్

**మొదటిపేజీ తరువాయి**

పేర్కొన్నారు. ఈఏపీసెట్ ను మొదటిసారిగా నిర్వహించామన, గతంలో ఎంసెట్ పేరిట పరీక్షలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. అనంతరం ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ.. ఈఏపీసెట్ రాసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈఏపీసెట్ కు గత పదేండ్లలో లేనంత మంది ఈసారి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో షిప్టులో దాదాపు 50 వేల మంది పరీక్ష రాశారని వివరించారు. గతంలో ఒక్కో షిప్టులో 25 వేల మంది మాత్రమే పరీక్ష రాసే వారని తెలిపారు. కాగా ఫలితాలు చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దని ఆయన చెపన్నారు. కాగా అడ్మిషన్ కు సంబంధించిన షెడ్యూల్ ను త్వరలో విడుదల చేస్తామని ఆయన స్పష్టంచేశారు.

# ఆంధ్రాపిల్లలే టాపర్లు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీ సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలు విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,40, 618 మంది విద్యార్థులు.. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 91,633 మంది విద్యార్థులు హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 89 శాతం.. ఇంజినీరింగ్ విభాగంలో 74.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులు సాధించడం విశేషం.

### అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల కోసం క్లిక్ చేయండి

### ఇంజినీరింగ్‌లో ర్యాంకులు..:

మొదటి ర్యాంకుఎస్.జ్యోతిరాదిత్య(శ్రీకాకుళంపాలకొండ)
రెండో ర్యాంకు హర్ష(కర్నూలుపంచలింగాలు)
మూడో ర్యాంక్‌రిషి శేఖర్ శుక్లా(సికింద్రాబాద్‌తిరుమలగిరి)
నాలుగో ర్యాంకుసందేశ్(హైదరాబాద్‌మాదాపూర్)
ఐదో ర్యాంకుసాయి యశ్వంత్ రెడ్డి(కర్నూలు)
ఆరో ర్యాంకు పుట్టి కుశల్ కుమార్(అనంతపురంఅర్కేనగర్)
ఏడో ర్యాంకు హుండికర్ విదీత్(హైదరాబాద్‌పుప్పాలగూడ)
ఎనిమిదో ర్యాంకురోహన్(హైదరాబాద్‌ఎల్లారెడ్డిగూడ)
తొమ్మిదో ర్యాంకుకొంతేమ్ మణితేజ(వరంగల్‌ఘన్‌పూర్)
పదో ర్యాంకుధనుకొండ శ్రీనిధి(విజయనగరం)

### అగ్రికల్చర్, ఫార్మసీలో ర్యాంకులు..

మొదటి ర్యాంకుప్రణీత(మదనపల్లె)
రెండో ర్యాంకురాధాకృష్ణ(విజయనగరం)
మూడో ర్యాంకుశ్రీవర్షిణి(హనుమకొండ)
నాలుగో ర్యాంకుసాకేత్ రాఘవ్(చిత్తూరు)
ఐదో ర్యాంకు సాయి వివేక్(హైదరాబాద్‌ఆసిఫ్‌నగర్)
ఆరో ర్యాంకుమహమ్మద్ అజాన్‌సాద్(హైదరాబాద్‌నాచారం)
ఏడో ర్యాంకువడ్లపూడి ముకేశ్ చౌదరి(తిరుపతివెంగమాంబపురం)
ఎనిమిదో ర్యాంకుభార్గవ్ సుమంత్(హైదరాబాద్‌పేట్‌బషీరాబాద్)
తొమ్మిదో ర్యాంకుజయశెట్టి ఆదిత్య(హైదరాబాద్‌అల్వీన్ కాలనీ)
పదో ర్యాంకు దివ్యతేజ (శ్రీసత్యసాయి జిల్లాబలిజపేట)



# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

## ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

**విశాలభారతి,హైదరాబాద్ :**

హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ జరగనుంది. దీనికి సంబంధించిన కీలక ప్రకటన ప్రసాదం పంపిణీదారు బత్తిన ఫ్యామిలీ చేసింది. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజు ఇచ్చే చేప ప్రసాదం ఇచ్చేందుకు ఈ ఏడాది కూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 8న ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రసాదం తింటే ఆస్తమా తగ్గుతుందని వేల మంది ప్రజలు నమ్ముతున్నారు. అందుకే ఈ ప్రసాదం ఎప్పుడెప్పుడు ఇస్తారా అని ఎదురు చూసే వాళ్ల సంఖ్య వేలల్లో ఉంటుంది. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ చేప ప్రసాదం బత్తిని కుటుంబం పంపిణీ చేయనుంది. దీని కోసం ఇప్పటికే ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నట్టు సమాచారం. ప్రసాదం తయారీ ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఏటా మృగశిర కార్తె ప్రవేశించిన రోజున ఈ ప్రసాదం బతికి ఉన్న చేపలో పెట్టి పంపిణీ చేస్తుంటారు. ఈ ఏడాది జూన్ 8న మృగశిర కార్తె ప్రవేశిస్తోంది. ఆరోజు చేప ప్రసాదం పంపిణీ చేయబోతున్నట్టు బత్తిన అనురీత్‌గౌడ్, గౌరీ శంకర్ గౌడ్‌లు వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీలో భాగంగా పంపిణీకి ముందు రోజుల ప్రత్యేక పూజలు చేస్తారు. ఏటా చేసినట్టుగానే ఈసారి కూడా సత్యనారాయణ స్వామి వ్రతం, తర్వాత భావి పూజచేసిన తర్వాత ప్రసాదం తయారీ ప్రక్రియ పూర్తి చేస్తారు. తర్వాత రోజు జూన్ 8 నుంచి పంపిణీ ప్రారంభిస్తారు. దీని కోసం వేలల్లో జనం తరలి వస్తారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

# కేబినెట్ మీటింగ్ వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

మంత్రులకు వివరించారు. 2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్లు తేలిందన్నారు. అయితే రిపేర్లు, పునరుద్ధరణ చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండదని తోసిపుచ్చలేమని ఎన్డీఎస్ఏ నివేదికలో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే సుందిళ్ల, మేడిగడ్డ, అక్కడి పంప్ హౌస్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి అన్నారు. నెల రోజుల్లో (జూన్‌లో) వర్షాకాలం ప్రారంభం కానుంది. ఈలోగా తీసుకోవాల్సిన చర్యలపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రాజెక్టుకు రిపేర్లు చేయాలా.. ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా, మరింత నష్టం జరగకుండా ఏమేం చర్యలు చేపట్టాలనేది ఇరిగేషన్ విభాగం అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. కేబినెట్ భేటీ జరిగితే రైతులకు సంబంధించిన అత్యవసరమైన అంశాలతో పాటు జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించాలనుకున్నారు. రాష్ట్ర పునర్విభజనకు పదేండ్లు పూర్తి కానున్న సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్ లో ఉన్న అంశాలపై చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డి భావించారు. సోమవారం లోపు కేబినెట్ భేటీకి ఈసీ నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి అనుమతి కోరాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. శనివారం కేబినెట్ భేటీ వాయిదా పడటంతో పలు కీలకమైన అంశాలపై చర్చించలేకపోయామని మంత్రులు తెలిపారు.

# దమ్ముంటే అరెస్ట్ చేయండి



**మొదటిపేజీ తరువాయి**

విచ్ఛిన్నం కాదు.. కావాలంటే ప్రయత్నించండి'' అన్నారు.

### మేం చేసిన తప్పేంటి..?

''ఇంతకీ ఆప్ ఏం తప్పు చేసింది?పేదలకు నాణ్యమైన విద్య, మొహల్లా క్లినిక్‌లను అందించడమే అది చేసిన తప్పా? మంచి పనులకు అడ్డుకట్ట వేసేందుకే భాజపా తీవ్రంగా యత్నిస్తోంది. మా నేతలందరినీ జైల్లో పెట్టి ఆప్‌ను నాశనం చేయాలని చూస్తోంది. అది ఎన్నటికీ జరగదు. ఆప్ ప్రజల గుండెల్లో ఉంది'' అని కేజ్రీవాల్ దుయ్యబట్టారు.

### డ్రామాలు ఆపండి: బీజేపీ

దిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. ''సొంత పార్టీ మహిళా నేతపై జరిగిన దాడిపై కేజ్రీవాల్ మౌనం వహిస్తున్నారు. మీరు చేస్తున్న డ్రామాలు ఇక ఆపండి. ఆమెపై దాడి జరిగి రోజులు గడుస్తున్నా ఇంకా ఎందుకు పెదవివిప్పడం లేదు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరు?'' అని భాజపా చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా ప్రశ్నించారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యమెందుకు?

**మొదటిపేజీ తరువాయి**

వివరించారు. ధాన్యం కాంటా కోసం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు వారాల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన వినతిలో పేర్కొన్నారు. కాంటా అయిన ధాన్యాన్ని లారీల కొరతవల్ల మిల్లులకు తరలించకపోవడం, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ పేరుతో తూకం వేయకుండా తిరస్కరించడం, తేమ, తరుగు పేరుతో బస్తాకు నాలుగు కిలోలు కోతపెట్టడమంటే మిల్లర్లు రైతులను దోచుకోవడమేనని సీఎంకు వివరించారు. ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు రోడ్లెక్కడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా వారు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలరోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు. మంత్రులు పట్టించుకోకపోవడం మరీ దారుణమన్నారు. ఇకనైనా ధాన్యం కొనుగోలు సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని 17 శాతం తేమ నిబంధన విధించకుండా కొనుగోలు చేయాలని, తేమ, తరుగు పేరుతో బస్తాకు నాలుగైదు కిలోల మేరకు కోత విధించకూడదని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు వెంటనే చెల్లించాలని, ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

# ఎయిర్ ఫోర్స్ అకాడమీలో మంచి అవకాశాలు

**టెన్త్, ఇంటర్ పూర్తి అయినా వారికి ఎన్నో మార్గాలు ▪ దేశ సేవ చేస్తూ డబ్బు సంపాదించే అవకాశం**

**విశాలభారతి ప్రత్యేకం:**

విద్యా సంవత్సరం మారింది. కొత్తగా టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు, తర్వాత ఏం చదవాలి, ఏం చేయాలని ఆలోచిస్తుంటారు. అయితే పదో తరగతి నుంచే కెరీర్ ప్లాన్ చేసుకోవడం మంచిది. టెన్త్ క్లాస్ పాస్ అయ్యాక కొందరు డిప్లొమా కోర్సులు చదివితే, మరికొందరు హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్‌పై దృష్టి పెడతారు. ఆ తర్వాత కెరీర్ ప్లాన్ చేసుకుంటారు. అయితే అర్హత ఉన్నవారు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరి, దేశానికి సేవ చేయవచ్చు. ఇందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరాల్సి ఉంటుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీని 1969లో స్థాపించారు. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్‌లో ఉన్న ఈ సంస్థ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన ప్రీమియం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్. ఇది హైదరాబాద్ నుంచి 43 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ ఫ్లయింగ్, టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లకు ట్రైనింగ్ ఇస్తారు. అలాగే ఆర్మీ, నేవీ అధికారులకు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇస్తారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి.

### ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్



ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా మేల్, ఫిమేల్ స్టూడెంట్స్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరవచ్చు. ఈ ఎగ్జామ్‌ను ఫిబ్రవరి, ఆగస్టులో సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తారు. అభ్యర్థులు గ్రాడ్యుయేట్ లేదా ఇంజనీర్ అయి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు ఎఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో 14 సంవత్సరాల పాటు షార్ట్ సర్వీస్ కమిషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు ప్రారంభించే సమయానికి అభ్యర్థుల వయసు తప్పనిసరిగా 20 నుండి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ క్లియర్ చేసిన అభ్యర్థులను ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ కి పిలుస్తారు.

### సిడిఎస్ఈ

**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సంవత్సరానికి రెండుసార్లు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. దీని ద్వారా ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ట్రైనింగ్‌కు ఎంపికైన వారు ఫైటర్ పైలట్లు, హెలికాప్టర్ పైలట్లు లేదా ట్రాన్స్‌పోర్ట్ పైలట్లుగా శిక్షణ పొందుతారు.**

### ఎన్ సిసి

**నేషనల్ క్యాడెట్ కార్ప్స్ లో ఎయిర్ వింగ్ సీనియర్ డివిజన్ సి సర్టిఫికేట్ హోల్డర్స్, ఎఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌కి అప్లై చేసుకోవచ్చు.**

### నేషనల్ డిఫెన్స్ అకాడమీ

ఇంటర్ లేదా 12వ తరగతి పూర్తి చేసిన వారు ఎన్డీఏ ద్వారా ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరవచ్చు. వీరికి మొదటి మూడు సంవత్సరాలు పూణేలోని ఎన్డీఏ ఖడక్వాస్లాలో శిక్షణ ఉంటుంది. అనంతరం ఎఎఫ్ఎలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇస్తారు. అభ్యర్థి ఎయిర్ ఫోర్స్‌ను ఎంచుకుంటే, ఎన్డీఏ ద్వారా ఎఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో మాత్రమే చేరవచ్చు. డిఫెన్స్ సెక్టార్‌పై ఆసక్తి ఉన్నవారు ఏదైనా ఎన్డీఏ ఎగ్జామ్‌కు హాజరుకావచ్చు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ప్రవేశానికి, అభ్యర్థులు తప్పనిసరిగా పరీక్షల్లో క్వాలిఫై అయ్యి, తర్వాత సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూ క్లియర్ చేయాలి.

# పచ్చని ఇంటికి పునాదులు వేసుకుందాం

2ND EDITION IGBC GREEN PROPERTY SHOW
17, 18 & 19 MAY 2024 | HITEX, HITEC CITY, HYDERABAD

- హైటెక్స్ వేదికగా ఉత్సాహంగా సాగుతున్న ఐజీబీసీ ప్రాపర్టీ షో
- కొలువుదీరిన పర్యావరణహితమైన భవనాలు, ప్రాజెక్టులు
- ఆకట్టుకున్న డ్రీమ్ యువర్ ఫ్యూచర్ గ్రీన్ హోం పెయింటింగ్ పోటీలు
- పర్యావరణ సంరక్షణపై నిపుణులతో చర్చాగోష్ఠి









**ప్రకృతిని పరిరక్షించుకుందాం.. పచ్చని ఇంటికి పునాదులు వేసుకుందాం... భావితరాల భవిష్యత్తుకు బాటలు వేసుకుందామంటూ సాగుతున్న ఐజీబీసీ రెండో ఎడిషన్ ప్రాపర్టీ షోకు నగరవాసులు, పర్యావరణ ప్రేమికులు, సొంతింటి కలలను సాకారం చేసుకునే కొనుగోలుదారులతో సందడిగా మారింది. ప్రాపర్టీ షో రెండో రోజున నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా, పర్యావరణ పరిరక్షణను ప్రేరేపించేలా సామాజిక అవగాహన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. డ్రీమ్ యువర్ ఫ్యూచర్ ఇన్ ఏ గ్రీన్ హోం పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు ప్రత్యేక కళాఖండాలను ఆవిష్కరించి... పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వామ్యం అవుతామంటూ చాటి చెప్పారు. ఇక సుస్థిర పర్యావరణమే మనిషి మనుగడకు ఆయువుపట్టులా నిలుస్తుందంటూ నిర్వహించిన చర్చాగోష్ఠిలకు నగరవాసుల అనూహ్యరీతిలో స్పందించారు. హైటెక్స్‌లో కొలువుదీరిన గ్రీన్ హోమ్ ప్రాజెక్టులను సందర్శించి పచ్చని ఇండ్లకు ఇక్కడి నుంచే పునాదులు వేసుకుంటామంటూ సిటీజనాలు ఆసక్తిగా పాల్గొంటున్నారు. నేటితో మూడ్రోజుల పచ్చని ఇండ్ల ఉత్సవం ముగియనుంది. వీకెండ్ కావడంతో జనాలతో రద్దీగా పెరిగింది. ఉదయం 10గంటల నుంచే జనాలు తాకిడి మొదలుకావడంతో... పర్యావరణహితమైన కలల సౌధాల గురించి తెలుసుకునేందుకు జనాలు ఆసక్తిగా ముందుకు వచ్చారు.**

**- విశాలభారతి, హైదరాబాద్**

హైదరాబాద్ వేదికగా జరుగుతున్న దేశంలోనే మొట్టమొదటి ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షోకు జనాలతో సందడి నిలిచింది. పర్యావరణహితమైన భవనాలను అవగాహన పెంచేలా డెవలపర్‌లు, ఆర్థిక సంస్థలు ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను ఔత్సాహిక కొనుగోలుదారులు ఆసక్తితో సందర్శించారు. మే 17న మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించగా... రెండో రోజున ప్రాపర్టీ షోలో భాగంగా నిర్వహించిన పెయింటింగ్ కాంపిటీషన్, నిపుణుల చర్చాగోష్ఠిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజుల ప్రదర్శనలో భాగంగా 70కి పైగా ప్రముఖ డెవలపర్‌ల నుండి ఐజీబీసీ సర్టిఫైడ్ గ్రీన్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లు, సుస్థిరమైన ఉత్పత్తులు, అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ప్రాజెక్టులను ప్రదర్శించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల పెయింటింగ్...

చిన్నారుల్లో పర్యావరణ స్పృహను కలిగించేలా నిర్వహించారు. డ్రీమ్ యువర్ ఫ్యూచర్ ఇన్ ఏ గ్రీన్ హోమ్ పేరిట ఐజీబీసీ నిర్వహించిన చిన్నారుల పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు రీసైకిల్ చేసిన కాగితాలపై పెయింటింగ్ చేయడం ద్వారా పర్యావరణ అనుకూలమైన విధానాలపై అవగాహన కల్పించారు. ఉత్సాహంతో చిన్నారుల సృజనాత్మకతతో కళానైపుణ్యాలు ప్రదర్శించారని, నగర వాసుల నుంచి కూడా అనూహ్య స్పందన వచ్చిందని జాతీయ వైస్ ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవేర్‌నెస్ సెషన్‌లో భాగంగా గ్రీన్ రెసిడెన్షియల్ సొసైటీ ఛాలెంజ్‌ని ప్రారంభించారు. మహిళలు చిన్న పిల్లలకు భద్రత, గృహాల కోసం నీటి పొదుపు పద్ధతులు సేఫ్ అండ్ గ్రీన్ ఈవీ నిబంధనలు, సుస్థిరమైన నిర్మాణం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ తొలగింపు ఫ్యూచర్ ఆఫ్ సస్టయినబిలిటీ, వాతావరణ మార్పు కోసం కమ్యూనిటీ ఆధారిత పరిష్కారంపై ప్యానెల్ చర్చ జరిగింది. నెట్ జీరో టు ల్యాండ్‌ఫిల్ ఈవెంట్‌గా నిలిచింది. ప్యానెల్ డిస్కషన్‌లో భాగంగా బన్సీలాల్‌పేట మెట్ల బావి పరిరక్షణపై కల్పనా రమేష్ వివరించారు. చెరువుల సంరక్షణ కోసం చేస్తున్న ధ్రువాంశ్ ఫౌండేషన్ నిర్వహకులు మధులిక, ఈపీటీఆర్ఐ వాతావరణ మార్పు వంటి అంశాలపై వివరించారు. సాంప్రదాయ భవనాల కంటే ఐజీబీసీసర్టిఫైడ్, ప్రీసర్టిఫైడ్ గ్రీన్ ప్రాజెక్ట్‌లను ఎంచుకోవడం ద్వారా పచ్చని భవిష్యత్తులో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాపర్టీ షోను నిర్వహించారు. అదేవిధంగా ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించే హరిత భవనాల ప్రయోజనాల గురించి నిర్వహకులు వివరించారు.

## గ్రీన్ బిల్డింగ్ సహజ వనరుల సంరక్షణ

ఐజీబీసీ గ్రీన్ హోమ్‌లు శక్తి వినియోగాన్ని 30% వరకు, నీటి వినియోగాన్ని 50% వరకు తగ్గిస్తాయని ఐజీబీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. ఆనంద్ అన్నారు. ఇది నివాసితులకు గణనీయమైన ఖర్చును ఆదా చేస్తుందని, అదనంగా గ్రీన్ హోంలకు అంతర్గత గాలి నాణ్యతను మెరుగుపరచడం, సహజ కాంతి, వెంటిలేషన్‌కు ప్రాప్యతను అందించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తాయన్నారు.

## 32 అంశాల ఆధారంగా గ్రీన్ బిల్డింగ్ రేటింగ్


దేశంలో గ్రీన్ బిల్డింగ్ భావనలను ప్రోత్సహించడానికి 2001లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ద్వారా ఐజీబీసీని స్థాపించినట్లుగా జాతీయ వైస్ ప్రెసిడెంట్ సీ. శేఖర్ రెడ్డి తెలిపారు. కార్పొరేట్, ప్రభుత్వం, నోడల్ ఏజెన్సీలు, ఆర్కిటెక్ట్‌లు, ఉత్పత్తి తయారీదారులు, సంస్థలు మరిన్నింటిని కలిగి ఉన్న నిర్మాణ పరిశ్రమలోని అన్ని వాటాదారులచే కౌన్సిల్ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. 11.67 బిలియన్ చదరపు అడుగుల గ్రీన్ బిల్డింగ్ పాదముద్రతో, 13,380+ ప్రాజెక్టులతో ఐజీబీసీ 32 రేటింగ్ సిస్టమ్‌లను అనుసరించి దేశంలో గ్రీన్ బిల్డింగ్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నెట్ జీరో రేటింగ్ విధానాలను అనుసరించి 90% గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్ట్‌లతో భారత్‌ను ముందంజలో నిర్వహించడమే ఐజీబీసీ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.

## ముగింపు వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి...

మూడు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించిన గ్రీన్ ప్రాపర్టీ షో ఆదివారంతో ముగియనుంది. ఈ క్రమంలో సాయంత్రం 5గంటలకు జరిగే ముగింపు వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆయనతోపాటు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని నిర్వహకులు పేర్కొన్నారు.









# సింగిల్ విండో డైరెక్టర్ కి పరామర్శ

**చిట్యాల, విశాలభారతి:** వెలిమినేడు సింగిల్ విండో డైరెక్టర్, చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ బోయపల్లి స్వామి గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.డైరెక్టర్ గంగాపురం భాస్కర్ గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న చైర్మన్ తోటి పాలకవర్గ ఏనుగు రఘుమారెడ్డి అధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు స్వామి పరామర్శించి,మెరుగైన చికిత్స ను అందించాలని వైద్యులను కోరారు. వైద్య ఖర్చులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ధైర్యంగా ఉండమని బరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్ లు గడ్డం సత్తిరెడ్డి,టేకుల కవితాఅంజిరెడ్డి,పిశాటి బీష్మారెడ్డి,మామిడి శ్రీరాములు, ఏదుళ్ల అజిత్ రెడ్డి,మురాల గోపయ్య, సీఇఓ బొంతల రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకి ఉచితంగా యూనిఫామ్ అందజేత

- **గోపాలపురం కుట్టు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**సూర్యాపేట, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్ అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. శనివారం సూర్యాపేట జమ్మిగడ్డలో గల గోపాలపురం కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5వ తేదీ కల్లా ప్రతి విద్యార్థికి ఒక జత అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.
ఇక్కడ 2,255 మంది పిల్లలకు యూనిఫార్మ్ కుట్టి అందజేయనున్నట్లు ఏపీడి రామ్ సురేష్ కలెక్టర్ కు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాల ఏర్పాటు చేసిందని,అలాగే ఎస్ హెచ్ జి మహిళల ద్వారానే స్కూల్ యూనిఫామ్స్ కుట్టించి ప్రభుత్వ పాఠశాలలకు సప్లై చేయడం జరుగుతుందని, దీనివల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా స్వయం శక్తి ద్వారా పిల్లల యొక్క యూనిఫార్మ్స్ ను కుట్టించడం జరుగుతుందని దీనివల్ల మహిళలు ఉపాధి కొరకు బయటకు వెళ్లే అవసరం లేకుండా మంచి అవకాశం ప్రభుత్వం కల్పించిందని అందరూ సద్వినియోగం చేసుకొని, నాణ్యమైన మెటీరియల్ వాడుతూ యూనిఫామ్ కుట్టాలని కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో యూనిఫార్మ్స్ కుడుతున్న ఫాజియా అన్నపూర్ణలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ అవకాశం ప్రభుత్వం కల్పించడం వలన ఎంత ఉపాధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 53,234 విద్యార్థులకు జూన్ 12 నాటికి రెండు జతలు యూనిఫార్మ్స్ 1, 0 6, 4 6 8 యూనిఫార్మ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మధుసూదన్ రాజు, అడిషనల్ డిఆర్డిఓ సురేష్,డిపిఎం ఆంజనేయులు, ఏపీఎం వెంకయ్య, సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీలు నిర్వహించిన ఏఎస్ఐ



**సిరికొండ, విశాల భారతి** ఏఎస్ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. సిరికొండ మండలం కుద్దుల్ పేట్ క్రాసింగ్ వద్ద ఏఎస్ఐ బాల్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. హెల్మట్, లైసెన్స్ లేనిది వాహనాలు నడపరాదని, తప్పని సరిగా ద్విచక్ర వాహన కాగితాలు వెంట ఉండాలని, వాహనానికి నెంబర్ ప్లేట్ వేయించుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపారాదని ఆయన వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనాలకు కాగితాలు లేని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాటికీ జరిమానా విధించారు. ఇందులో ఏఎస్ఐ బాల్ సింగ్, కానిస్టేబుల్ నవీన్, సంతోష్ లు వున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు తీసుకోవాలి

- **నారబోయిన**



**చిట్యాల, విశాలభారతి:** జాతీయ రహదారి 65 పై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై యుద్ధ ప్రాతిపదికన నివారణ మరమ్మత్తు చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ నాయకులు నారబోయిన శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.హెచ్.65 పై జరుగుతున్న ప్రమాదాలు రోడ్డు విస్తరణలపై మరమ్మత్తులకు వేగవంతం చేయాలని సమీక్ష నిర్వహించిన రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని చిట్యాల పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు నాయకత్వంలో చిట్యాల పట్టణంలో సంతకాల సేకరణ సేకరించి ప్రభుత్వానికి అందజేశారు. చిట్యాల పట్టణంలోని బస్టాండ్ దగ్గర, కనకదుర్గమ్మ అమ్మవారి సెంటర్లో, మరియు రైల్వే స్టేషన్ రోడ్ అనేక ప్రమాదాలు ప్రాణాలు కోల్పోయారు.వీటిని బ్లాక్ స్పాట్ ప్రదేశంగా గుర్తించి వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. 17 బ్లాక్ స్పాట్ గుర్తించిన ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తక్షణమే సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ చేయడం కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలని కాపాడాలని కోరారు.

# కామ్రేడ్ జవ్వాడి సూరమ్మకి విప్లవ జోహార్లు



**బయ్యారం, విశాలభారతి:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ జే వి చలపతిరావు మాతృమూర్తి కామ్రేడ్ జవ్వాడి సూరమ్మ కి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బయ్యారం సబ్ డివిజనల్ కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తున్నాం.



# వైద్య సేవలను విస్తరించాలి

- **సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జీ.సక్రు**

**గార్ల, విశాలభారతి:** మండలంలోని అంజనాపురంలో జరిగిన యువకుల సదస్సులో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సద్గురు మాట్లాడుతూ, రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గ్రామాలన్నీ బురదమయమై, మురుగు వాసన వస్తున్నాయని తద్వారా ప్రజలకు అంటువ్యాధులు, విష జ్వరాలు గానీ ప్రబలకుండా స్థానిక గ్రామపంచాయతీల సిబ్బంది వారు తక్షణం పారిశుధ్య పనులను చేపట్టాలని అలాగే వైద్యశాఖ వారు ఆరోగ్య, అవగాహన శిబిరాలను,డ్రైడే శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఆయన కోరారు. ఈ యువతా సదస్సులో ఎం బావ సింగ్, రవి, భీముడు, తేజస్, రాకేష్, భారత్, నాగు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

- **యూనియన్, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు ఎం.రాజేందర్**

**మణుగూరు, విశాలభారతి :** మున్సిపాలిటీ కార్మికులకు 2021 జూన్ నుండి 2023 మార్చి వరకు రావలసిన ఏరియర్స్ చెల్లించాలని బట్టలు, చెప్పులు, మాస్కులు, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరినూనె లాంటి సదుపాయాలు కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి. రాజేందర్ మున్సిపల్ అధికారులను కోరారు. శనివారం నాడు మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 జూన్ నుండి పి ఆర్ సి సూచించిన వేతనాలు అమలు కావలసి ఉన్నప్పటికీ, 2023 మార్చి వరకు మున్సిపల్ కార్మికులకు అమలు చేయలేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఆరోగ్యాలను, ప్రాణాలను పణంగా పెట్టి, చెత్తా చెదారం మధ్య దుర్గంధ వాసనల మధ్య పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. 2021 జూన్ నుండి 2023 మార్చి వరకు మున్సిపల్ కార్మికులకు రావలసిన ఏరియర్స్ ను వెంటనే చెల్లించాలని, బట్టలు, చెప్పులు, మాస్కులు, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె తదితర సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐ ఎఫ్ టి యు మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి పోడుతూరి లక్ష్మీనారాయణ, పి. నరసింహారావు, దుర్గయ్య, త్రిమూర్తులు, పోశం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి

- **కురవి మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం**
- **కాంగ్రెస్ పార్టీ నాయకులు బట్టు ఉప్పలయ్య**

**కురవి విశాలభారతి:** నల్లెల్ల గ్రామంలో మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం అధ్యక్షతన పట్టభద్రుల ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంబటి వీరభద్రం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, రానున్న రోజుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేస్తుందని తెలిపారు. కావున పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలపరచి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రజనీకాంత్, ఎమ్మెల్సీ సమన్వయ కమిటీ సభ్యులు దయ్యాల శ్రీధర్, బానోత్ రమేష్, పరిషబోయిన బిక్షపతి,బండి సంతోష్ కుమార్, దయ్యాల మనోజ్ కుమార్, కటకం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.




# మట్టి తరలిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలి

- **ప్రభుత్వ శాఖ అధికారుల పర్మిషన్ లేకుండా అక్రమంగా మట్టి తరలింపు**
- **ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగిరాము**

**మిర్యాలగూడ, విశాలభారతి:** గ్రామాలలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగిరాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని చెరువులన్నీ ఎండాకాలం తీవ్రత వలన ఎండిపోవడం జరిగింది దీని ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు మరియు ఇటుక బట్టీల వ్యాపారుల కోసం చెరువులో ఉన్నటువంటి మట్టిని అక్రమంగా తరలించడం జరుగుతుందని వాస్తవంగా గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యదర్శి పర్మిషన్ తీసుకుని మరియు గ్రామంలోని రైతులు మట్టిని తరలించుకోని పొలాలలో సేద్యం చేసుకోవడానికి వినియోగించుకునే హక్కు ఉంటుంది కానీ అదేవిధంగా ఇతర అవసరాల నిమిత్తం ఎవరైనా తీసుకుని వెళ్లాలి అనుకునే సందర్భంలో మైనింగ్ అధికారుల యొక్క పర్మిషన్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి పర్మిషన్ తో క్యూబిక్ మీటరుకు కొంత నామమాత్రపు రుసుము చెల్లించి మట్టిని కొన్ని నియమాల ప్రకారం కొన్ని మీటర్ల పరిధి మేరకే తవ్వవలసి ఉంటుంది. కానీ కొంతమంది రైతుల ముసుగులో మట్టి వ్యాపారులు దీన్ని అదునుగా తీసుకొని జెసిబి బండ్లతో నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలో విపరీతంగా చెరువులలో నుండి మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రమాదకరస్థాయిలో గుంతలు ఏర్పడే విధంగా తవ్వకాలు చేపడుతున్నా పరిస్థితి చాలా దౌర్భాగ్యం, ఇటువంటి అక్రమంగా మట్టిని తరలిస్తున్న దళారుల పైన ఇరిగేషన్, మైనింగ్ శాఖా, రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే స్పందించి అక్రమంగా చెరువు మట్టిని తరలించే వారిపైన చర్యలు తీసుకొని చెరువుల యొక్క హద్దులను నాణ్యతను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్. ఎండి జలీల్ బాబా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చెన్నబోయిన నర్సమ్మ, మండల నాయకురాలు టింగికారి పద్మ, యువజన సంఘం జిల్లా నాయకులు కూరపాటి మహేష్, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు ఉబ్బపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.



# వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

- **అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్**

**సైదాపూర్, విశాల భారతి** మండలంలోని ఎగ్లాస్పూర్ గ్రామంలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. స్వామివారికి మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, దీక్ష కంకణధారలు, అఖండ దీప స్థాపన, కలశ స్థాపన, సర్వదేవతాహ్వానం, అభిషేకాధి షోడశోపచార సహిత సామూహిక కుంకుమార్చన, మంత్ర పుష్ప నీరాజనం, గురుపూజలను చేశారు. అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వపతి రవీందర్, మురళి, కందుకూరి నిరంజన్, సురేష్, చంద్రకళ, రాజేశ్వరి, భరతవ, గోవిందమ్మ, సుమన్, చందు,చారి తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో వాసవి మాత జయంతి మహోత్సవం

**కల్వకుర్తి, విశాలభారతి** పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం వాసవి మాత జయంతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ దశమి ని అమ్మవారి జయంతిగా జరుపుకుంటారు. జయంతి మాసం సందర్భంగా వేకువజామున వాసవి మాతకి అభిషేకం అనంతరం గీతా పారాయణం హనుమాన్ చాలీసా పటణం అమ్మవారి పల్లకి సేవను నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. పల్లకి సేవ అనంతరం సామూహిక కుంకుమార్చన వాసవి మాత పారాయణ పఠనం జరిగింది. అనంతరం వాసవి మాత డోలాహరణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు ఉత్సవాలకు హాజరయ్యారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులందరికీ ఆలయ చైర్మన్ రమేష్ బాబు భోజన ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుల్లపల్లి శ్రీధర్, కోశాధికారి శివా జగదీశ్వర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంప శ్రీనివాస్ వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్ అవోపా అధ్యక్షుడు సతీష్ గుప్తా, పెద్ద సంఖ్యలో మహిళలు, ఆర్యవైశ్యులు భక్తులు పాల్గొన్నారు.




# ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

**సైదాపూర్, విశాల భారతి** సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామంలోని ముదిరాజుల ఆరాధ్య దైవమైన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ముదిరాజులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కుర్జి శ్రీనివాస్ స్వామి, శ్రీహరిహర పీఠం వ్యవస్థాపకులు కుర్జీ ఆదిశేష వర్ధనస్వామి ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నవ కలశ స్థాపన, అభిషేక కార్యక్రమంను పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి,పాడి పంటలు బాగా పండాలని, గొడ్డు గోదా సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పెసరి సంపత్, ఉపాధ్యక్షుడు గుల్ల రమేష్, కార్యదర్శి కుందేళ్ళ సమ్మయ్య,కుల పెద్ద మనిషి గుళ్ళ వెంకటయ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**వనపర్తి విశాల భారతి :**ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 24 నుండి ప్రారంభమయ్యే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పగటి బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ ను సూచించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్, సమయానికి ఆర్టీసి బస్సులు నడపాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతుల తో పాటు ప్రథమ చికిత్స కిట్లతో ఏ ఎన్.యం, ఆశా వర్కర్లను నియమించాలని వైద్య అధికారిని ఆదేశించారు. పరీక్షలు జరగనున్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేసేవిధంగా తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేవిధంగా చూడాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సి.సి టి.వి కెమెరాలు ఉండేవిధంగా చూడాలని అవసరమైన చోట స్క్రైబ్ లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సి. మద్దిలేటి మాట్లాడుతూ... మే 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలో వనపర్తి జిల్లా నుండి 6134 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 3978 ఉండగా ద్వితీయ సంవత్సరం 2156 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుండి 12.00 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయని వివరించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, అదనపు ఎస్పీ రామదాసు తేజావత్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, తహసిల్దార్ కిషన్ నాయక్, డి.యం. ఆర్టీసీ తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీ మృతి



సేవా నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సూర్యాపేట, విశాలభారతి:** ఉపాధి హామీ పనులు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి ఉపాధి హామీ కూలీ మృతి చెందిన సంఘటన సూర్యాపేట మండల పరిధిలోని సపావత్ తండా గ్రామ ఆవాసం జేతునాయక్ తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఉపాధి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం జెతునాయక్ తండా కు చెందిన రమావత్ సేవానాయక్ (65) జెతునాయక్ తండాలోని చెరువులో జరుగుతున్న చెరువు మట్టి పూడిక తీత పనులకు వెళ్లి కూలీలతో కలిసి ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే సేవానాయక్ ను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే సేవా నాయక్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉపాధి హామీ కూలి పనులు చేస్తూ మృతి చెందిన

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

■ **జిల్లా ఎస్పి రాహూల్ హెగ్డే**




**సూర్యాపేట, విశాలభారతి:** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లాలో శాసనమండలి పట్టబద్రుల ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనల పరిధి దాటకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని అన్నారు. అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని, వారి ప్రసంగాలలో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని అన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దని అన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇండ్ల గోడలపై రాతలు రాయటం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్ట్ లు పెట్టరాదని అన్నారు.ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులు చేయవలసి వస్తే సి విజిల్ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చని తెలిపారు.



# అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ప్రారంభం

**సిరికొండ, విశాల భారతి** అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సిరికొండ మండలం చిన్న వాల్గొట్ గ్రామములోని ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రొండ్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల చిన్న వాల్గొట్ గ్రామ పాఠశాలలో బాత్రూం డోర్ లు, ఫ్యాన్ లు, ట్యూబ్ లైట్స్, వివిధ పనులను శనివారం ప్రారంబించమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు రొండ్ల గోవర్ధన్ రెడ్డి, దుబాయ్ గంగారెడ్డి, రొండ్ల సాయరెడ్డి, పంచాయితీ కార్యదర్శి శరణ్య, కారోబార్ సాయి, మహిళా సంఘం అధ్యక్షురాలు గంగామణి, సి ఏ రాజేశ్వర్ లు వున్నారు.



# ఘనంగా వాసవి మాత జయంతి వేడుక

**సిరికొండ, విశాల భారతి** వాసవి మాత జయంతిని సిరికొండ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించుకున్నారు. సిరికొండ మండల కేంద్రంలోని తాళ్ల రామడుగు రామాలయంలో శనివారం వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతిని ఆర్యా వైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యా వైశ్య సంఘ అధ్యక్షులు మురళి మాట్లాడుతూ.. వాసవి మాత జయంతిని ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని, సిరికొండ ఆర్యవైశ్యులకు వాసవి మాత ఆశీస్సులు, ఆయు అష్టైశ్వర్యాలను ఇవ్వాలని కోరుకుంటున్ననని ఆయనే అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు పురుషోత్తం,మురళి,రాజు,శ్రీనివాస్,మారుతీ,శంకరయ్య, ప్రణీత్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# షాప్ ప్రారంభోత్సవంలో కొండ గణేష్

**సైదాపూర్, విశాల భారతి** వెజిటేబుల్స్ అండ్ ఫ్రూట్స్ షాప్ ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాజామాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొండ గణేష్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ వేన్కేపల్లి పెట్రోల్ పంపు ఎదురుగా బోయిని శ్రీనివాస్, లతా దంపతులు ఏర్పాటుచేసిన వెజిటేబుల్స్, ఫ్రూట్స్ షాప్ ఓపెనింగ్ కి కొండ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ గణేష్ మాట్లాడుతూ గతంలో ఫ్రూట్స్ కావాలంటే హుజురాబాద్, హుస్నాబాద్,కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లి కొనుక్కోవలసిన పరిస్థితి ఉండేదని,ఇప్పుడు మన దగ్గరలోనే వెజిటేబుల్ షాప్ ను ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. వెజిటేబుల్స్, ఫ్రూట్స్ షాపును ఏర్పాటు చేసిన బోయిని శ్రీనివాస్ లతా దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, బొమ్మగాని రాజు, సైదాపూర్ మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు దొకిడి తిరుపతి, గడ్డం శేఖర్, అందే అనిల్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆహ్లాదాన్ని పంచుతున్న పల్లె ప్రకృతి వనం

■ **గ్రామపంచాయతీ సెక్రటరీ పూర్ణచంద్ర కృషి ఎంతగానో ఉంది**



**భీమదేవరపల్లి విశాల భారతి** పచ్చని కళాతోరణంలా అత్యద్భుతంగా మండలంలోని ముల్కనూర్ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం దట్టమైన అడవి లాగా రూపుదిద్దుకుంది. పల్లె ప్రకృతి వనాలు ఏ గ్రామంలో చూసిన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తుంటాయి. కానీ ఇక్కడ భిన్నంగా మొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అరణ్యంలా కనిపిస్తుంది. ఇలా రూపుదిద్దుకోవడానికి ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీ పూర్ణచంద్ర కృషి ఎంతగానో ఉందని చెప్పచ్చు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనం సంతరించుకుంది. ఆహ్లాదకరమైన వాతావరణం వలన ప్రజలు చిన్నారులు సాయంకాలం వేళ్ళ అలా కాసేపు వనంలో ఆహ్లాదంగా గడుపుతున్నారు. వేసవికాలం రిత్యా నిరు లేక మొక్కలు ఎండిపోతుంటే ఇక్కడ మాత్రం గ్రామ కార్యదర్శి చొరవతో బోరు సదుపాయం కల్పించి ఎప్పటికప్పుడు నిరు పట్టిస్తూ పచ్చదనంగా ఉంచుతున్నారు. ఈ విధంగా ఆహ్లాదకారానికి తోడ్పడిన పంచాయతీ కార్యదర్శి ని పలువురు ప్రశంసిస్తున్నారు.



**మొక్కలు పెంచడంతో భావితరాలకు భవిష్యత్తు:** భూమి మీద జనసాంద్రత పెరిగే కొద్దీ అడవులను చెట్లను నరికి మానవాళి జీవన అవసరాలకు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీని మూలంగా చెట్లు తరిగి మానవాళికి ప్రమాదంగా మారుతుందని మొక్కలను పెంచడం వల్ల భావి తరాలకు మనం మంచి పర్యావరణం రూపు దిద్దిన వాళ్ళుగా అవుతామని అందుకే ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు చొప్పున నాటితే పర్యావరణం ఎంతో అద్భుతంగా రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. గ్రామంలో ఉన్నటువంటి ఏ సమస్యనైనా పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**నల్లగొండ, విశాలభారతి:** జిల్లాలో ఈదురు గాలులతో పడుతున్నా వర్షాల దృష్ట్యా వాహనదారులు, ప్రయాణికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణ సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణ సమయంలో రోడ్లపై వర్షం నీరు చేరడం వల్ల వాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వాహనాలు అతి వేగంగా నడపవద్దని వర్షం పడే సమయంలో ప్రయాణాలు చేయకుండా వీలైతే వాయిదా వేసుకోవాలని సూచించారు. వాతావరణం తడిగా ఉన్నందున కరెంట్ స్థంబాల వద్దకు వెళ్ళకుండా ఉండాలని అలాగే ఈదురు గాలులు బాగా వీస్తున్న క్రమంలో వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు వర్షం పడే సమయంలో బారి వృక్షాల కింద నిలపడకూండా ఉండాలని అన్నారు. అత్యవసర సమయంలో సహాయం కొరకు డయల్ 100 కి కాల్ చేయాలని సూచించారు.






# గ్రూప్ 1 ప్రిలిమినరీ అభ్యర్థులు బయోమెట్రిక్ తో హాజరవ్వాలి

**వనపర్తి విశాల భారతి:** జూన్ 9న జరగబోయే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను వనపర్తి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీ, అదనపు కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రాంతీయ సమన్వయ కర్తలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో గ్రూప్ 1 పరీక్షలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమయ్యే పరీక్షకు అభ్యర్థులు 10 గంటల లోపు పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని సూచించారు. ఉదయం 9 నుండి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలో అనుమతిస్తారని, 10 గంటలకు గేట్లు మూసివేయడం జరుగుతుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తీసుకోవడం జరుగుతుందని, రెండు అంచల్లో తనిఖీలు, గేటు వద్ద, లోపల సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలు సిద్ధం చేసుకోనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఇతర అధికారులు వనపర్తి జిల్లా నుండి పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**భీమదేవరపల్లి విశాల భారతి** తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృధ్వీరాజ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురిసి, రైతుల చేతి కొచ్చిన వడ్లు తడిసి ముద్దయి రైతులకు తీవ్ర నష్టం జరగిందన్నారు. ఇప్పటికి కరువుతో అల్లాడుతున్న రైతులకు అకాల వర్షం తీవ్ర నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూకం వేసిన బస్తా నుంచి ఎలాంటి కటింగ్ లేకుండా తీసుకోవాలని అన్నారు. క్వింటాలుకు 500 బోనస్ ప్రకటించాలి. 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. చేతికి వచ్చిన పంట ఆకాల వర్షాలకు దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండు సారయ్య, గూడెల్లి సదానందం, గోదల సంపత్, రామోజీ శ్రీనివాస్, దొంగల వేణు, కర్ణాకర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

■ **సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శివారపు శ్రీధర్**



**కేసముద్రం, విశాలభారతి:** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాద్ జిల్లా నాయకులు శివారపు శ్రీధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న, వరి పంటలు నీట మునిగి రైతులకు నష్టాన్ని కలుగజేశాయని, వర్షం వల్ల తడిసిన ధాన్యానికి అధికంగా తేమ ఉండటం వల్ల ఐకెపి సెంటర్లలో పంటను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టకుండా పూర్తిగా ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆరుకాలం కష్టపడిన రైతుకు అకాల వర్షాల వల్ల తీవ్రమైన నష్టం కలుగుతుందని, పండించిన పంటను ఆరబెట్టుకోవడానికి గాని, ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి గిడ్డంగుల సౌకర్యం లేదని, తడిసిన ధాన్యాన్ని అరబెట్టుకోవడానికి తక్షణమే ప్రభుత్వం గిడ్డంగులను నిర్మించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రత్యేక బీమా సౌకర్యాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అదే విధంగా రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చేందుకు చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు సప్లై చేయడం వల్ల రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, దీనివల్ల వ్యవసాయం వృద్ధి చెందుతుందని, రైతులు అప్పుల బారిన పడకుండా ఉంటుందని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ, వాటిని తక్షణమే అమలు చేసి రైతంగానే ఆదుకోవాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతంగానే అదుకోవాలని అన్నారు. తేమ సాకు చూపెట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తే రైతులందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




# నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

■ **సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్**

**సూర్యాపేట, విశాలభారతి:** గత మూడు రోజుల నుండి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యం కారణంగా అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో నిర్వహించిన సిపిఎం పార్టీ జిల్లా కేంద్ర కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా సూర్యాపేట జిల్లాలో విస్తారంగా కురుస్తున్న అకాల వర్షాల మూలంగా ఐకెపి కేంద్రాలలో, వ్యవసాయమార్కెట్ లలో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతుధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరికి ఎకరాకు 30 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. వరి పంటతో పాటు జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటలు విస్తారంగా ఉన్నాయని ముఖ్యంగా ఇటీవల వరుసగా వస్తున్న గాలి దుమ్ముల మూలంగా మామిడి, సపోటా, బొప్పాయి, తదితర పంటలు ఈదురు గాలులకు నేలమట్టమై తీవ్ర నష్టం వాటిలిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే అధికారులను నష్టపోయిన వరి, ఇతర పండ్ల తోటల రైతుల వివరాలు సేకరించి తగిన విధంగా నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా స్పందిస్తున్నందున ప్రభుత్వ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి నష్టపోయిన పంటలను అంచన అధికారులు వేసి ప్రభుత్వానికి అందించాలని రాతపూర్వక నివేదిక అందజేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులను కాపాడాలని ఆయన అన్నారు. సన్న రకం దొడ్డు రకం అని తేడా లేకుండా రూ.500 రూపాయలు బోనసును వెంటనే అందజేయాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లా పల్లి నరసింహారావు, వేల్పుల వెంకన్న, దండ వెంకటరెడ్డి, కొప్పుల రజిత, వీరబోయిన రవి, మేకన బోయిన శేఖర్, ఎల్గూరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప ముఖ్యమంత్రిని కలసిన టీఎన్జీవోస్ అధ్యక్షులు

**హైదరాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) కేంద్ర సంఘ నాయకులు కస్తూరి వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ మరియు నగరశాఖ ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు శంకర్ కలిసి ఉద్యోగుల సమస్యల వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగులకు రావలసిన నాలుగు డిఏ బకాయిలో ఒక డిఏ విడుదల చేయాలని, పిఆర్సి, హెల్త్ కార్డ్, సిపిఎస్ రద్దు మరియు ఇతర ముఖ్య అంశాలపై చర్చించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అతి త్వరలో ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు.



# అసంపూర్తిగా ఉన్న యాదవ భవనాన్ని పూర్తి చేయండి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** అసంపూర్తిగా ఉన్న యాదవ కుల సంఘం భవనాన్ని పూర్తి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఈర్లపల్లి జయ యాదవ కులస్తులతో కలిసి కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో యాదవ సంఘం భవనం సగం పూర్తి చేసి మిగతా పని నిధులు లేక మధ్యలోనే ఆపేసామని ఎమ్మెల్యే కి వారు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి భవనానికి అవసరమైన నిధులు తాను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో రైస్ మిల్లుల పదుల సంఖ్యలో ఉన్నాయని వాటి నుంచి వచ్చే కాలుష్యపు పొగ నుంచి గ్రామంలోని ప్రజలకు క్యాన్సర్ సమస్యలు వచ్చాయని రైస్ మిల్లుల నుంచి విముక్తి కలిగించాలని ఎమ్మెల్యే నీ కోరారు. గ్రీన్ ట్రిబ్యునల్ అధికారుల తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



# విద్యా హక్కు చట్టానికి తూట్లు

- ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు
- చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**విద్యా సంవత్సరం మొదలు కాకుండానే, నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఇబ్రహీంపట్నం మండల నాయకులు పల్లపు శివకుమార్ ఆధ్వర్యంలో విద్యా శాఖ సీనియర్ అసిస్టెంట్ శేషగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ విచ్చలవిడిగా పెద్ద పెద్ద హోర్డింగులు, బ్యానర్లతో వింత ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని అన్నారు. విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ఇంటర్నేషనల్, టెక్నో ఒలింపియాడ్ వంటి పేర్లను వాడుతూ తల్లితండ్రులను, విద్యార్థులను మోసం చేస్తున్నారని వారు ఎద్దేవ చేశారు. కార్పొరేట్ స్కూల్ పెద్ద ఎత్తున ఫీజుల దోపిడీ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాధికారులు స్పందించి ఇలాంటి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఏనుగంటి శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం మండల నాయకులు ప్రవీణ్, గండికోట శివ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సుభాష్ నగర్ లో శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, గురుపూజ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, టీపీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేతరి దర్శన్, సీనియర్ నాయకులు నారని శేఖర్ గౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, రాయబండి వెంకటేష్ చారి, గౌని వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఓవర్ లోడ్ వాహనాలు సీజ్

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న ఆర్టీవో

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**వాహనాలు ఓవర్ లోడ్ తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి హెచ్చరించారు. సుభాష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఓవర్‌లోడుతో వెళ్తున్న 13 వాహనాలను ఏఎంవీఐ ఉపాసిని, ఆర్టీవో అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ టీ వో సుభాష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ వాహనాలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహన పరిమితి లోడ్‌కు మించి వేయొద్దని, రోడ్డు సేఫ్టీ పాటించాలని ఆయన సూచించారు.



# అనారోగ్యానికి గురైన కార్యకర్తను పరామర్శించిన రమేష్

**కూకట్ పల్లి, విశాలభారతి:**అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ శనివారం పరామర్శించారు. బోయినపల్లి దుబాయ్ గేట్ కు చెందిన అబ్దుల్ అస్లాం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇతని తండ్రి అబ్దుల్ సత్తార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా కొనసాగాతున్నారు. సత్తార్ కు ఇటీవల గుండెపోటు రావడంతో ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొంది శనివారం తన నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రమేష్ సత్తార్ ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకోవాలని, ఎప్పటి మాదిరిగా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్తార్, అతని కుటుంబ సభ్యులు రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మణ్, నాయకులు రాజేందర్, డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, విజయ కాంత్ రెడ్డి, శ్రీరాములు, ఆనందబాబు, అస్లాం తదితరులు ఉన్నారు.,

# కేసీఆర్ కు రైతులపై కపట ప్రేమ

- దొంత సుధాకర్

**సైదాపూర్ విశాల భారతి** ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంత సుధాకర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని అన్నారు. కేసీఆర్ పాపాలతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చాయని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాలలో ఎంతో మంది రైతులు చచ్చిపోయారని ఏ ఒక్క రోజైనా రైతుల గురించి ఆలోచించినాడా



రైతుల బాధలు పట్టించుకున్నాడా అని ఆవేదన వ్యక్తం చేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నీలం మధు





**పటాన్ చెరు,విశాలభారతి:**తిరుమల వెంకటేశ్వర స్వామిని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ దర్శించుకున్నారు. మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకున్న నీలం మధు ఉదయం విఐపి బ్రేక్ దర్శనం ద్వారా వెంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవదేవుడు శ్రీనివాసుడు ఆశీస్సులతో మెదక్ పార్లమెంట్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మెదక్ పార్లమెంటుతో పాటు తెలంగాణలో అత్యధిక సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని వేడుకున్నారు.



# శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవము

**కూకట్ పల్లి,విశాలభారతి:**శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవము, కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ సెకండ్ ఫేస్ లోనీ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్ద జలకన్య సెంటర్ లో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం లో శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవములు బండోజి నరసింహ చారి, మానేపల్లి గోపి చారి, ఏ ఎస్ ఆర్ రమేష్ చారి, కమ్మరి రామకృష్ణ చారి ఆధ్వర్యంలో అత్యంత భక్తి పూర్వకముగా నిర్వహించారు, ఈ ఆరాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని సేవించి తీర్థ ప్రసాదములు స్వీకరించి కాలజ్ఞాన మహర్షి శ్రీ వీరభద్ర స్వామి వారి కృపకు పాత్రులై, పూజ అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం, బిసి జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరి కృష్ణ, సీనియర్ పాత్రికేయులు భాస్కర్ చారి, సురభి రమేష్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు అందుకే సంఖ్యలో పాల్గొని ఆ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కృపకు పాత్రులు అయినారు.



# పెన్ మహోత్సవం పోస్టర్ రిలీజ్

- కార్యక్రమంలో తెల్ల హరికృష్ణ, ఆకుల వీరస్వామి

**హైదరాబాద్,విశాలభారతి:** ఈనెల 25, 26 తేదీలలో జరగబోయే పెన్ మహోత్సవం పోస్టర్ రిలీజ్ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం కూకట్ పల్లి లోని మున్నూరు కాపు సంఘం, తెలంగాణ రాష్ట్రం, రాష్ట్ర కార్యదర్శి, బిసి సంక్షేమ సంఘం బిసి జర్నలిస్టు ఫోరం, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తెల్ల హరికృష్ణ కార్యాలయంలో, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆకుల వీర స్వామి ఆధ్వర్యంలో పెన్ మహోత్సవం పోస్టర్ రిలీజ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పెన్ మహోత్సవం కార్యవర్గ సభ్యులు మహేష్, రమేష్, నక్క రాంప్రసాద్, సీనియర్ పాత్రికేయులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు,

# అన్నదాతలు ఆందోళన చెందొద్దు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ కు మంత్రి పొన్నం ఆదేశం
- ప్రభుత్వం అండగా ఉంటుంది
- డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత



**చిగురుమామిడి, విశాల భారతి:**గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని సర్కార్ అండగా ఉంటుందని డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలపై మంత్రి పొన్నం ఆరా తీసినట్లు ఆయన తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి తాలు లేకుండా కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ కు మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి పొన్నం అమెరికా పర్యటన ఉన్నప్పటికీ ఇక్కడ పడుతున్న వర్షాలతో ప్రజలకు ఏమి నష్టం జరుగుతున్నాయి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని ఆయన వివరించారు. రైతులెవరు అధైర్యపడవద్దు అని... ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని ఆయన వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎవరు ఆందోళన చేందొద్దు అని ఆయన భరోసా కల్పించారు.

# ఓయూకు దళిత వీసీని నియమించాలి

- అంసా సైదులు.



**సికింద్రాబాద్, విశాలభారతి:**
ఈసారి ఓయూ వీసీ దళిత సామాజిక వర్గానికి కేటాయించాలని అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు కోరారు. 100ఏండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో దళిత సామాజిక వర్గాలకు ఇంతవరకు వీసీ పదవీ అందరిని ద్రాక్షగా ఉందని అన్నారు. మిగతా సామాజిక వర్గాలకు ఓసి లు, బీసీలకు వీసీలుగా అవకాశం కల్పించిన పాలక ప్రభుత్వాలు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఓయూ వీసీ పదవీ కేటాయించాలని అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు.

# హరిసింగ్ రత్నావత్ కు డాక్టరేట్ ప్రధానం

- యంజి తండా నుండి తొలి డాక్టరేట్ గా రికార్డ్

**సికింద్రాబాద్ , విశాలభారతి:**సూర్యాపేట జిల్లా, చివ్వెముల మండలం, ఎంజీ నగర్ తండాకు చెందిన కమలమ్మ లక్ష్మా నాయక్ ల కుమారుడు రత్నవత్ హరిసింగ్ ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టు లో సీనియర్ ప్రొ. డాక్టర్ విబి నరసింహ పర్యవేక్షణలో (గైడ్ షిప్ ) లో " నెట్వర్క్ ఇన్ట్రూషన్ డిటెక్షన్ ఇన్ హనీ పాట్ ఫ్రేమ్ వర్క్ యూజింగ్ ఏ.ఐ మోడల్స్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. దీంతో ఓయూ పరీక్షల విభాగం ఆయనకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హరిసింగ్ రత్నావత్ మాట్లాడుతూ ఒక పేద గిరిజన కుటుంబం నుండి ఉన్నత చదువే లక్ష్యంగా ఓయూకు వచ్చిన నేను గతంలో ఎంసీఏ చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలో పీహెచ్డీ ప్రవేశాలు లేవు ఎంసీఏ విద్యార్థులకు సైతం ఇంజనీరింగ్ కళాశాలలో పిహెచ్డీలు ఇవ్వాలని హరిసింగ్ పోరాటం మొదలు పెట్టాడు. ఐటీ విభాగంలో పీహెచ్డీల ప్రవేశం అయిన తోనే పీహెచ్డీ అడ్మిషన్స్ ప్రారంభం కావడం విశేషం.



అయిన పోరాటంతో పలువురు విద్యార్థులు ఐటీ సబ్జెక్ట్ లో పీహెచ్డీ అడ్మిషన్లు పొందారు. దీనికి తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ పీహెచ్డీ డాక్టరేట్ పొందడానికి సహకరించిన ఓయూ ప్రొఫెసర్స్ , గైడ్ ప్రొ.వి బి నరసింహ తోపాటు ప్రో.వెంకట దాస్, రాంబాబు, శ్రీనివాస రావు, ప్రొ. సుజాత, మరియు తల్లిదండ్రులకు , జీవిత సహచరి సుహాసిని, నా మిత్రులు శ్రీనివాస్, రాకేష్, విద్యార్థి నాయకులు డా. బట్టు.శ్రీహరి, డా.ఎల్చల దత్తాత్రేయ డా.ప్రేమ్ లకుమాలకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ పొందిన హరిసింగ్ ను ఓయూ ప్రొఫెసర్స్ విద్యార్థి నేతలు ఘనంగా సన్మానించారు. యంజి నగర్ తండా నుండి మెదటి పీహెచ్డీ పూర్తి చేసిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించారు. హరిసింగ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కీలకమైన కృషి చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ ఎండి.షాకీర్ అలీ

**జహీరాబాద్,విశాలభారతి:**తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో కోహీర్ వైస్ ఎంపీపీ ఎండి.షాకీర్ అలీ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికీ తప్పకుండ ఫలితం ఉంటుందని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైనుకుల్లా పని చేసి లీడ్ తీసుకొచ్చిన వారికే స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటిసి, టికెట్లు ఇచ్చి తప్పకుండ గెలుపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి భరోసానీచ్చారు. ఎవరు అధర్యాపడవద్దని ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎవరు బాధపడకుండా ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని



చేయాలని సూచించారు. ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో యువతకు తగిన ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు.





# విద్యుత్ షాక్ తో నాలుగు గేదెలు మృతి

- ఒక్కో గేదె విలువ 70 నుండి 80 వేలు
- నిర్లక్ష్యంలో అధికారాలు

**నూతనకల్ విశాలభారతి:**
విద్యుత్ షాక్ తో నాలుగు గేదేలు మృతి చెందిన ఘటన నూతనకల్ మండలం అలుగునూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. విద్యుత్ తీగలు నెలకు ఆనుకునే విధంగా ఉండడంతో మేత కోసం వెళ్ళిన గేదలు విద్యుత్ షాక్ తో చనిపోయాయి. అలుగునూరుకు చెందిన మల్లెబోయిన వెంకన్నకు సంబంధించిన మూడు గేదెలు, మల్లెబోయిన కాటమయ్య కు సంబంధించిన ఒక గేదె మొత్తం నాలుగు గేదెలు మృతి చెందాయి. ఒక్క పాడి గేదే దాదాపుగా 70 వేల నుండి 80,000 విలువ చేస్తాయని పాలిచ్చే పాడి పశువులు మరణించడంతో బాధిత రైతు కుటుంబం విలపించారు. కండ్ల ముందే నిర్జీవంగా పడి ఉన్న మూగ జీవాలను చూసి బాధిత కుటుంబం అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పాడి గేదె 70 వేల నుంచి 80 వేల వరకు ఉంటుందని దాదాపుగా 4 లక్షల విలువ చేసే నాలుగు గేదెలు మృతి చెందాయని రైతు వాపోయారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కరెంట్ తీగలు నేలకు ఆనుకునే విధంగా ఉన్నాయని రైతులు పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోకుండ ,కనీసం వాస్తవ పరిస్థితి ఎలా ఉందని క్షేత్ర పరిశీలన కూడా చేయలేదని రైతులు పేర్కొన్నారు. అల్గునూరు గ్రామంలోని కాకుండా మండలంలోని వివిధ గ్రామాలలో డిడి కట్టి ఏండ్లు గడుస్తున్నప్పటికీ విద్యుత్తు స్తంభాలను విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయకపోవడం దానితో చేసేదేమీ లేక రైతులు కర్రల సహాయంతో తీగలను ఏర్పాటు చేసుకొని వ్యవసాయ పనులు చేయడంతో వర్షాలు వచ్చినప్పుడు ఈ విధంగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని ఇప్పుడు గేదేల వరకే వచ్చిందని అదే స్థానంలో ఎవరైనా మనుషులు ఉంటే ఎంత ప్రాణ నష్టం జరిగేదని ఎన్ని కుటుంబాలు ఆగమయ్యేదని పలువురు రైతులు బహిరంగనే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను విద్యుత్ తీగల ఏర్పాటు చేయాలని కోరారుమ్మ్ ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని బాధిత రైతు కుటుంబాలు వేడుకుంటున్నాయి.విషయం తెలుసుకున్న ఏఈ ప్రణయ్ కుమార్, లైన్మెన్ సైమన్ సంకటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇట్టి ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా అందే విధంగా చూస్తామని ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com








# డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్ కు సీఎంను ఆహ్వానించిన తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్

రేపు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించబోతోంది తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్. ఈ వేడుక రావాల్సిందిగా అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్, వైస్ ప్రెసిడెంట్ వశిష్ట, దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్ శంకర్ నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి వస్తానని చెప్పినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి విజన్ ఉందని, ప్రపంచ సినిమాకు టాలీవుడ్ హబ్ గా మారేలా చేద్దామని సీఎం చెప్పినట్లు టీఎఫ్ డీఏ అధ్యక్షుడు వీరశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా టీఎఫ్ డీఏ ప్రెసిడెంట్ వీర శంకర్ మాట్లాడుతూ నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని నేను, హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, వశిష్ట మరికొందరు వెళ్లి కలిశాం. ఐదు నిమిషాలు మాట్లాడాలని వెళ్తే సుమారు గంట సేపు మాతో సినిమా ఇండస్ట్రీ గురించి సీఎం మాట్లాడటం హ్యాపీగా అనిపించింది. చిత్ర పరిశ్రమ అభివృద్ధి గురించి సీఎం గారి విజన్ కు ఆశ్చర్యం వేసింది. ప్రపంచ సినిమా హబ్ గా టాలీవుడ్ మారాలని, ఆ దిశగా ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వరల్డ్ క్లాస్ ఫిలిం ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించాం. డైరెక్టర్స్ డే ను ప్రపంచమంతా గుర్తుపెట్టుకునేలా ఈ ఈవెంట్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి గారు తప్పకుండా వస్తామని మాటిచ్చారు. అని చెప్పారు.

# కేన్స్‌లో మెరిసిన కృతి

ఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌లను ధరించి రెడ్ కార్పెట్‌పై హొయలు పోతున్నారు. ఇక టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్ హీరోయిన్ కియారా అద్వానీ తొలిసారిగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. లోరియల్ ప్యారిస్ బ్రాండ్ అంబాసిడర్‌లలో ఒకరైన కియారా అద్వానీ కేన్స్‌లో వానిటీ ఫెయిర్ హోస్ట్ చేస్తున్న రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్ ఉమెన్ ఇన్ సినిమా గాలా డిన్నర్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రబల్ గురుంగ్ డిజైన్ చేసిన హై-స్లిట్ గౌనులో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, పెద్ద చెవిపోగులతో మరింత ఆకర్షణీయంగా కనిపించింది. అక్కడ ఫొటోషూట్‌కు సంబంధించిన చిన్న వీడియో క్లిప్‌ని కియారా తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.






# సుమయా రెడ్డి బర్త్ డే

## స్పెషల్ పోస్టర్, సాంగ్ విడుదల

అనంతపురం నుంచి వచ్చిన అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగమ్మాయి సుమయా రెడ్డి నిర్మాతగా, హీరోయిన్‌గా, కథా రచయితగా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సుమయా రెడ్డి, పృథ్వీ అంబర్ హీరో హీరోయిన్లుగా సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్ మీద సుమయా రెడ్డి నిర్మించిన చిత్రం డియర్ ఉమ. ఈ చిత్రానికి సాయి రాజేష్ మహాదేవ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పోస్టర్, టీజర్, నవ్వుతుంటనే అనే సాంగ్ అందరినీ ఆకట్టుకున్నాయి. సుమయా రెడ్డి పుట్టిన రోజు (మే 18) సందర్భంగా డియర్ ఉమ నుంచి స్పెషల్ పోస్టర్ మరియు సాంగ్‌ను రిలీజ్ చేశారు. సుమయా రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన నీవెవ్వరో అనే మెలోడీ పాట శ్రోతలను ఆకట్టుకునేలా ఉంది. ఈ మూవీ నుంచి వస్తోన్న ప్రతీ అప్డేట్ ఆడియెన్స్‌లో అంచనాలు పెంచేస్తోంది. మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీని చూడబోతున్నామనే హింట్‌ను చిత్రయూనిట్ ఇస్తోంది. ఈ మూవీతో కథా రచయితగా సుమయా రెడ్డి తన అభిరుచిని చాటుకునేలా ఉన్నారు. నిర్మాతగా సుమయా రెడ్డికి ఇది మొదటి చిత్రమే అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో రిచ్‌గా, భారీ స్థాయిలో సినిమాను నిర్మించారు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ సినిమాకి సంగీత దర్శకుడు రధన్. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.

# 'ఏసీఈ' ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్ విడుదల



విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ లీడ్ రోల్స్ లో ఆరుముగ కుమార్ దర్శకత్వంలో ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. యోగి బాబు, పి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కరణ్ బహదూర్ రావత్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనింగ్ ఎ.కె. ముత్తు, ఆర్. గోవిందరాజ్ ఎడిటింగ్. 'ఏసీఈ' అనే డిఫరెంట్ టైటిల్ తో రూపొందుతున్న ఈ కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 7Cs ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ గా నిర్మిస్తుంది. సోషల్ మీడియా, ఇంటర్నెట్ లో రివీల్ చేసిన ఫస్ట్ లుక్ లో విజయ్ సేతుపతి యూత్‌ఫుల్ లుక్, స్మోకింగ్ పైప్, డైస్ వేస్తూ కనిపించి అందరినీ ఆకర్షించారు. ఇది సినిమా గురించి అభిమానులలో క్యూరియాసిటీని పెంచింది. స్టార్ కాస్ట్, ఆకట్టుకునే నేపథ్య సంగీతం, విజయ్ సేతుపతి ఆన్ స్క్రీన్ ప్రెజెన్స్‌ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా టీజర్ అభిమానులను ఆకట్టుకుంది. జూదం, తుపాకులు, పేలుళ్లు, రాబరీస్, బైక్ ఛేజింగ్ వంటి అంశాలు అలరించాయి. టీజర్‌లో యోగి బాబు కామిక్ రియాక్షన్ హ్యూమర్ రేకెత్తిస్తుంది. ఇది సినిమా హిలేరియస్ క్రైమ్‌కామెడీ థ్రిల్లర్‌గా ఉంటుందని తెలియజేస్తుంది.

# అవార్డులు..హాలీవుడ్ కాదు?

హాలీవుడ్ లో ఛాన్స్ అంటే ఎగిరి గంతేస్తారు హీరోయిన్లు. ఇక అవార్డులు...రివార్డుల గురించి చెప్పాల్సిన పనిలేదు. వాటిని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి గౌరవిస్తుంటారంతా. బాలీవుడ్ నుంచి అవార్డులు అందుకున్న వారెంతో మంది ఉన్నారు. హాలీవుడ్ కి వెళ్లిన హీరోయిన్లు కొందరున్నారు. ఇలా ఎంత మంది ఉన్నా హాలీవుడ్ లో సత్తా చాటింది మాత్రం ప్రియాంక చోప్రానే. గ్లోబల్ స్టార్ ఇమేజ్ అన్నది ఆమెకి మాత్రమే సాధ్యమైంది. దీపికా పదుకొణే కూడా హాలీవుడ్ లో సినిమాలు చేసింది. ఈసారి పరిస్థితి వేరు కానీ అక్కడ మాత్రం బిజీ కాలేదు. బాలీవుడ్ లో మాత్రం స్టార్ హీరోయిన్ హోదాలో కొనసాగుతుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అవార్డులు.. రివార్డులు..హాలీవుడ్ అవకాశాల పట్ల దీపికా పదుకొణే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'నటించిన సినిమాలు విజయం సాధించాలి. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించాలి. అవార్డులు అందుకోవాలి. అక్కడ నుంచి హాలీవుడ్ అవకాశాలు రావాలి. అక్కడా సక్సస్ అవ్వాలి. మంచి స్థాయిలో ఉండాలి అని అంతా కోరుకుంటారు. కానీ నా దృష్టిలో ఇలాంటి వాటిని పట్టించుకోను. ఒక మంచి వ్యక్తిగా ఉండటం కంటే నాకేది ముఖ్యం కాదంటాను. మంచి వ్యక్తులతో సమయం గడపడం...సెట్ లో అనుభవాలు మర్చిపోలేని జ్ఞాపకాలుగా మిగుల్చుకోవాలి. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో కూడా నేను అందరిలాగే ఆలోచించే దాన్ని కాదు. కానీ సక్సెస్ అయిన తర్వాత ఇవన్నీ ఏంటి? మంచిగా ఉండటం కంటే మనిషికి కావాల్సింది ఏముంటుంది? అనిపించింది. సక్సెస్ అయ్యాను కాబట్టి ఈ మాట చెప్పలేదు. సక్సస్ కాకపోయినా ఓ ఏజ్ వచ్చేసరికి ఇదే వాస్తవం అని నమ్మేదాన్ని ' అని అన్నారు. దీపికా పదుకొణే ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీ కి వచ్చిన సంగతి తెలిసిందే. మోడలింగ్ నుంచి నటిగా టర్నింగ్ తీసుకుని నేడు బాలీవుడ్ లో అగ్ర హీరోయిన్ గా కొనసాగుతుంది. రణవీర్ సింగ్ ని ప్రేమించి వివాహం చేసుకుని ఫ్యామిలీ లైఫ్ లోనూ సంతోషంగా ఉంది.

# 'సిద్ధార్థ్ 40' అనౌన్స్ మెంట్



సక్సెస్ ఫుల్ పాన్‌ఇండియన్ యాక్టర్ సిద్ధార్థ్ చిత్ర పరిశ్రమలో 21 సంవత్సరాల అద్భుతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రతి పరిశ్రమలో శాశ్వత ప్రభావాన్ని చూపారు. అతను ఎంచుకునే కథలు, పాత్రల, అసాధారణమైన పెర్ఫార్మెన్స్ తో అద్భుతంగా అలరిస్తున్నాయి. బాలీవుడ్‌లో 'రంగ్ దే బసంతి'తో చెరగని ముద్ర వేశారు. తెలుగులో 'బొమ్మరిల్లు'తో ప్రేక్షకుల మన్ననలు పొందారు. తమిళ పరిశ్రమలో పలు జోనర్‌లలో మెరిసి.. సినిమా, నటనపై తనకున్న గొప్ప అభిరుచిని చూపించారు సిద్ధార్థ్. ఆయన లేటెస్ట్ ప్రాజెక్ట్ 'చిత' ప్రేక్షకుల హృదయాల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పుడు, సిద్ధార్థ్ 'సిద్ధార్థ్ 40'(వర్కింగ్ టైటిల్) పేరుతో మరో ఎక్సయిటింగ్ మూవీ కోసం కోసం మంచి యూనిట్ తో చేతులు కలిపారు. ఈ అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ను '8 తొట్టక్కల్'తో పేరుపొందిన శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్ లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ "యూనివర్సల్ ఆడియన్స్ అభిరుచులను ఆస్వాదించే మంచి కంటెంట్‌ను అందించాలనే దృక్పథాన్ని కలిగి ఉన్న మన పరిశ్రమలోని యంగ్ టీంతో కలిసి పని చేస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. సినిమా ఔత్సాహికులు, ఫ్యామిలీస్ 'చిత్త'పై తమ ప్రేమను కురిపించారు ఇది వారి భావాలను హత్తుకుని, మంచి కథలను ఎంచుకోవడానికి నాలో మరింత బాధ్యతను నింపింది. నేను చాలా స్క్రిప్ట్‌లు విన్నాను, శ్రీ గణేష్ చెప్పిన కథ నాకు ఎంతగానో నచ్చింది. ప్రేక్షకులపై ప్రభావం చూపే సినిమాలను తీయడమే నిర్మాతల ఆనందం. అలాంటి మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా వుంది. ఆయన మంచి సినిమాతో పరిశ్రమను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలలు కనే నిర్మాత. మా అంకితభావం, పాషన్ తో ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించే అద్భుతమైన సినిమాని అందిస్తాయనే నమ్మకం నాకుంది" అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.